

తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.89,500
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.8,098

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.98,700
రిటైల్ వెండి గ్రాము	రూ.101.70

శివశయన క్షేత్రం సురుటుపల్లి

- భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా సురుటుపల్లి క్షేత్రం
- దాంపత్య దక్షిణామూర్తిగా పరమశివుడు
- పార్వతీదేవి ఒడిలో శయనిస్తున్నట్లు విగ్రహరూపం



విద్యుత్ దీపాలంకరణలతో ముస్తాబైన పళ్లికొండేశ్వరాలయం

వరదయ్యపాళెం: పరమశివుడి శయన మందిరంగా సురుటుపల్లి క్షేత్రం విరాజిల్లుతోంది. సకల శైవక్షేత్రాల్లో లింగాకారంలో దర్శనమిచ్చే పరమశివుడు ఇక్కడ భారీ విగ్రహ రూపంలో పార్వతీదేవి ఒడిలో శయనించి పళ్లికొండేశ్వరస్వామిగా భక్తులకు దర్శనమిస్తారు. గర్భాలయంలో శివశక్తులతో పాటు సకల దేవతా గణాలు, సప్తరుషులు, గజపతి, సుబ్రమణ్యస్వామి విగ్రహాలు ఉన్నాయి. తిరుపతి–చెన్నై జాతీయ రహదారిలోని నాగలాపురం మండలం అరుణానది ఒడ్డున సురుటుపల్లి ఉంది. ఆంధ్ర రాష్ట్రంతో పాటు తమిళనాడు నుంచి భక్తుల రద్దీ విపరీతంగా ఉంటోంది. స్థల పురాణం ప్రకారం అమృతాన్ని పొందడానికి దేవతలు, రాక్షసులు పాల సముద్రాన్ని మధనం చేస్తుండగా హాలాహలం వెలువడింది. దీంతో భీతిల్లిన దేవతలు, రాక్షసులు త్రినేత్రుని శరణు కోరగా శివుడు హాలాన్ని నేరేడుపండు రూపంలో తీసుకుని మింగేందుకు ఉపక్రమిస్తుండగా హాలాహలం వల్ల అపాయం కలుగుతుందని భావించిన పార్వతీదేవి కంఠాన్ని గట్టిగా నొక్కిపట్టడంతో హాలాహలం కంఠం వద్దనే నిలిచిపోయింది. దీంతో కంఠం నీలంగా మారింది. అందువల్లే శివునికి నీలకంఠుడని పేరు వచ్చింది. అనంతరం పార్వతీ పరమేశ్వరులు కైలాసానికి వెళ్తుండగా మార్గమధ్యలో ప్రకృతి సౌందర్యాలతో అలరారే ప్రదేశంలో కొద్దిసేపు సేదతీరుతారు. హాలాహలం తాగిన మైకం కారణంగా ఈశ్వరుడు పార్వతీదేవి ఒడిలో విశ్రమిస్తాడు. అలా సేద తీరిన ప్రదేశమే సురుటుపల్లి. నారదుడి ద్వారా విషయం తెలుసుకున్న సకల సురగణం, ఈశ్వర దర్శనానికి ఇక్కడికి రావడంతో సురులపల్లి అనే పేరు రాగా.. ఈ ప్రాంతానికి కాలక్రమేణా సురుటుపల్లిఅని పేరు వచ్చింది. భూలోకంలో నీకు విగ్రహారాధనే ఉండదన్న భృగుమహర్షి శాప విముక్తి అనంతరం త్రినేత్రుడు పార్వతీదేవి ఒడిలో శయనిస్తున్నట్లు విగ్రహ రూపంలో భక్తులకు దర్శనమిస్తున్నట్లు ప్రతీతి.



భక్తులకు దర్శనమిస్తున్న దాంపత్య దక్షిణామూర్తి

ప్రదోష పూజలు..

నాగలాపురం మండలం సమీపంలో గల సురుటుపల్లిలో వెలసిన శ్రీపళ్లికొండేశ్వరస్వామి ఆలయంలో నెలకు రెండుసార్లు ప్రదోష పూజలు వస్తుంటాయి. అయితే సంవత్సరంలో 1, 2 సార్లు శనివారం వచ్చే శనిత్రయోదశి ప్రదోష పూజలు ఆలయంలో విశేషంగా నిర్వహిస్తారు. ప్రతి గురువారం దాంపత్య దక్షిణామూర్తికి అభిషేకం నిర్వహించిన భక్తులకు సకల దోషాలు తొలగి అష్టైశ్వర్యాలు కలుగుతాయి. ప్రదోష పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్న భక్తులకు సంతానం లేనివారికి సంతానం కలుగునని, వివాహం కానివారికి వివాహం జరుగునని, భార్యాభర్తల మధ్య కలహాలు తొలగిపోతాయని, భక్తులు కోరుకున్న కోర్కెలు తీరుతాయని భక్తులకు ప్రగాఢ నమ్మకం.

మరెన్నో పనులు, సేవలు..

- అమ్మవారికి, స్వామివారికి భక్తుల నుంచి సేకరించిన విరాళాలతో వజ్రకిరీటం
- 2012 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నిర్వహణ
- మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా పది రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో స్వామివారికి 12 వాహనాల్లో ఊరేగింపు, ఘనంగా ఉత్సవ ఏర్పాట్లు
- ఆలయంలో గోపూజా కార్యక్రమ నిర్వహణ, అన్నదాన కార్యక్రమాలు
- శనిదోష నివారణ పూజలు
- శ్రీకాళహస్తి ఆలయంలో నిర్వహించే సర్పదోష పూజలు మాదిరిగా ఆలయంలో పూజలు
- ఆలయంలో కల్యాణోత్సవం
- నవగ్రహ హోమం, గణపతి హోమం, రుద్రాభిషేకం, రుద్రహోమం తదితర పూజా కార్యక్రమాలు జరుగుతాయి

వైభవంగా బ్రహ్మోత్సవాల నిర్వహణ..

మహాశివరాత్రి సందర్భంగా సురుటుపల్లిలోని పళ్లికొండేశ్వరాలయంలో 10 రోజుల పాటు వార్షిక బ్రహ్మోత్సవాలు 28 వరకు బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతాయి. భక్తులకు ఇబ్బంది లేకుండా దాతల సహకారం, ప్రభుత్వ సమన్వయంతో ఉత్సవాల విజయవంతానికి అన్ని రకాల ఏర్పాట్లు చేపట్టాం. ఆలయ ప్రాంగణంలో విద్యుత్ దీపాలంకరణలు, పుష్పాలంకరణలతో తీర్చిదిద్దాం. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వలంటీర్లు, పోలీస్ సిబ్బందితో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాం.

- లత, ఈఓ, పళ్లికొండేశ్వరాలయ ఆలయ దేవస్థానం

నేత్రపర్వంగా వెంకన్న రథోత్సవం

చంద్రగిరి: శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజైన మంగళవారం స్వామి వారు శ్రీదేవి, భూదేవి సమేతంగా దివ్యరథాన్ని అధిరోహించి భక్తులకు దర్శనం ఇచ్చారు.

అశ్వ వాహనంపై వెంకన్న రాజసం

మంగళవారం రాత్రి స్వామి వారు అశ్వ వాహనంపై మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మితో పాటు ఆలయ సిబ్బంది తరపున స్వామి వారికి వివిధ రకాలైన పండ్లు, పూలను సమర్పించి, సర్కారు హారతిని అందుకున్నారు. అంతకు ముందు ఆలయ ప్రాంగణంలో స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవ నిర్వహించారు.



స్వామివారి దివ్యరథాన్ని లాగుతున్న భక్తులు

నేడు చక్రస్నానం

బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన చక్రస్నాన కార్యక్రమాన్ని బుధవారం ఉదయం 10 నుంచి 10.20 గంటల మధ్య ఆలయ పుష్కరిణిలో అర్చకులు వైఖానస ఆగమోక్తకంగా నిర్వహించనున్నారు. అనంతరం రాత్రి 7 నుంచి 8 గంటల మధ్య జరిగే ధ్వజవరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

క్లుప్తంగా

అశ్వ వాహనంపై రాజసం

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి శ్రీపళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా సాగుతున్నాయి. ఎనిమిదో రోజు మంగళవారం అశ్వ వాహనం పై ఊరేగుతూ స్వామివారు భక్తులను అనుగ్రహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. రాత్రి అశ్వ వాహనంపై స్వామి వారు, పల్లకీలో అమ్మవారు ఊరేగుతూ భక్తులను సమ్మోహనపరిచారు. ఉభయదారులుగా ఊత్తుకోట్టైకి చెందిన ఎంఆర్.తమిళరసన్, టీ.మోహన్ వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. గ్రామోత్సవంలో కోలాటం, భజనలు, భరతనాట్య నృత్యప్రదర్శన ఆకట్టుకుంది.

రేపు ఎస్వీయూలో జాబ్‌మేళా

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో గురువారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టీ.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ సంస్థ ఆధ్వర్యంలో సుమారు 50 పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, డీఫార్మసీ, బీఫార్మసీ, ఎమ్‌ఫార్మసీ చదివిన అభ్యర్థులు అర్హులని, ఆసక్తిగల వారు గురువారం ఉదయం 10గంటకు వర్సిటీ ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9533889902, 7989810194 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వాసుదేవనాయుడికి సన్మానం



మాజీ ఎమ్మెల్యే బియ్యపు, ఉన్నం వాసుదేవ నాయుడును సన్మానిస్తున్న పార్టీ నాయకులు

శ్రీకాళహస్తి: వైఎస్సార్‌సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉన్నం వాసుదేవనాయుడును నియమితులైన సందర్భంగా మంగళవారం తొట్టంబేడు మండల నాయకులు ఘనంగా సన్మానించారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఉన్నం వాసుదేవ నాయుడికి శాలువ కప్పారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే ఆయనకు సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చంద్రయ్యనాయుడు, మణినాయుడు, అల్ల య్య, గంగాధరం, ధర్మయ్య, గిరిధర్, శ్రీరాములు రెడ్డి, సర్పంచ్‌లు కృష్ణమూర్తి, జగదీష్ రెడ్డి, వీరభద్రయ్య, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గుడిమల్లం ఆలయంలో ఏర్పాట్ల పరిశీలన

ఏర్పేడు(రేణిగుంట): భారతదేశపు తొలి శైవక్షేత్రం ఏర్పేడు మండలం గుడిమల్లం శ్రీ ఆనందవల్లి సమేత పరశురామేశ్వరాలయంలో జరుగుతున్న శివరాత్రి ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పరిశీలించారు. ముఖ్యంగా క్యూలైన్‌లో ప్రవేశ, నిష్క్రమార్గాల వద్ద బందోబస్తు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. క్యూలైన్లను, పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. భక్తుల పట్ల సిబ్బంది మర్యాదగా ప్రవర్తించి పోలీసులకు వన్నె తెచ్చే విధంగా విధులు నిర్వహించాలని సూచించారు. విధుల్లో ఎక్కడ అలసత్వం వహించరాదని, అలా వహించిన సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు జయచంద్ర, శరత్‌చంద్ర, ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి, మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు పాల్గొన్నారు.



గుడిమల్లం ఆలయాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

నేడు మాజీ ఎమ్మెల్యే దీక్షధారణ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి స్వామివారి మాల ధరించనున్నారు. ఉదయం 5.30 గంటలకు ఆలయ ఆవరణలో ఆయన దీక్షాధారణ చేస్తారు. దీక్షామాల ధరించే భక్తులంతా ఉదయం 5.30 గంటలలోపు అర్ధనారీశ్వరస్వామి ఆలయం వద్దకు రావాలని ఆయన అభిమానులు కోరారు.

చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాసనాయక్

శ్రీకాళహస్తి: పట్టణంలోని సరస్వతీబాయి పురపాలక సంఘ పాఠశాలలో మంగళవారం 12వ జిల్లా అదనపు న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పోక్సో యాక్ట్, బాల్య వివాహాలకు సంబంధించి వివరించారు. ఏదైనా సమస్య ఉంటే శ్రీకాళహస్తి న్యాయసేవ అధికార సంస్థ ఉందని అందులో అర్జీ రూపంలో అందిస్తే ఉచితంగా సేవలందిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ భువనేశ్వరి, హెచ్ఎం, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం

నాగలాపురం: మండలకేంద్రంలోని స్థానిక టీఆర్ఆర్ కల్యాణ మండపంలో మంగళవారం అక్షర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో కళాశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఔషధ మొక్కల పెంపకంపై అవగాహన



మాట్లాడుతున్న దశరథరామి రెడ్డి

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): ఆంధ్రప్రదేశ్ ఔషధ, సుగంధ మొక్కల బోర్డు ముఖ్య కార్య నిర్వాహణాధికారి మంజుల, డీ.హోస్మని ఆదేశాల మేరకు రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఔషధ, సుగంధ మొక్కల పెంపకంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఉద్యాన అధికారి బీ.దశరథరామి రెడ్డి, రాస్ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ ఎస్.శ్రీనివాసులు, కేంద్రీయ ఔషధ, సుగంధ మొక్కల పరిశోధనా సంస్థ సీనియర్ శాస్త్రవేత్త డా.జ్ఞానేశ్ పాల్గొన్నారు. దశరథరామి రెడ్డి మాట్లాడుతూ ఉద్యానశాఖ వారు ఔషధ, సుగంధ పంటల సాగుపై రైతులకు రాయితీలు ఇస్తున్నట్లు తెలిపారు. సుగంధ పంటలపై 40 శాతం రాయితీతో ప్రాసెసింగ్ యూనిట్లు ఇస్తున్నట్టు పేర్కొన్నారు. రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఏ.పద్మజ, ఆయుష్ వైద్యాధికారి సీ.శశిరేఖ, కృష్ణమూర్తి, ఔషధ పంట ఉత్పత్తుల కొనుగోలుదారు శ్యామ్‌సుందర్‌రెడ్డి, బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

పరశురామేశ్వరుడికి పట్టువస్త్రాల సమర్పణ



గుడిమల్లం పరశురామేశ్వరునికి పట్టువస్త్రాలను సమర్పిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి



గుడిమల్లం ఆలయానికి విరాళ చెక్కును అందిస్తున్న సీఆర్ నిర్మలారాజన్

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు మండలంలోని పలు శైవక్షేత్రాలు మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. మండలంలోని గుడిమల్లంలో వెలసిన అతిపురాతన శైవక్షేత్రం పరశురామేశ్వరాలయాన్ని మంగళవారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి దంపతులు దర్శించి స్వామి,అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. అలాగే పాపానాయుడుపేట–గుడిమల్లం రోడ్డును ఆయన ప్రారంభించారు. గుడిమల్లం ఆలయంలో భక్తులకు పాపానాయుడుపేట పీహెచ్‌సీ సిబ్బంది వైద్యసేవలను అందించారు.

చెక్కు అందజేత..

వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సీఆర్ రాజన్ సతీమణి నిర్మలరాజన్, ఆయన కుమారుడు రంజీ ప్లేయర్ జ్ఞానేశ్వర్ మంగళవారం గుడిమల్లం ఆలయాన్ని దర్శించుకుని రూ.40 వేలు విరాళం చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పేరం ధనుంజయులునాయుడు, రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి, శివశంకర్‌రెడ్డి, పేరం నాగరాజునాయుడు, ఆలయ మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సిద్దేశ్వరాలయంలో నవచండీయాగ హోమం..

మండలంలోని చిందేపల్లిలో వెలసిన శ్రీ దాక్షాయణి, పార్వతీ సమేత సిద్దేశ్వరాలయంలో మంగళవారం ఆలయ ధర్మకర్త గంగలపూడి గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నవచండీయాగ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. బుధవారం మహాశివరాత్రిన ఉదయం స్వామి, అమ్మవార్ల శాంతి కల్యాణం, సాయంత్రం రుద్రాభిషేకం, రాత్రి లింగోదర్భవ అన్నాభిషేకం, విశేష పూజలు జరుగుతాయని ఆయన తెలిపారు.

ప్రాథమిక విద్య బలోపేతానికి 'జ్ఞానజ్యోతి'

సత్యవేడు: జాతీయ విద్యావిధానంలో మార్పులకు అనుగుణంగా పూర్వ ప్రాథమిక విద్యను అందించే అంగన్‌వాడీ కేంద్రాలు జ్యానజ్యోతి శిక్షణా కార్యక్రమంతో బలోపేతం అవుతుందని ఎంఈఓ కే.రవి అన్నారు. మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరు రోజుల శిక్షణా కార్యక్రమం ముగిసింది. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ జ్యానజ్యోతి సర్టిఫికెట్ కోర్సు శిక్షణలో విద్యా విధానం, ప్రాముఖ్యం, ప్రాథమిక విద్యతో ప్రణాళిక తదితర అంశాలపై అవగాహన కల్పించారన్నారు. పిల్లల్లో శారీరక, చలన అభివృద్ధి, సామాజిక, భావోద్వేగ సామర్థ్యాలతో పాటు ఆరోగ్యకరమైన అలవాట్లపై అవగాహన పొందారన్నారు. అనంతం టీఎల్ఎం ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 ఉష, రిసోర్సుపర్సన్లు బాలకృష్ణ, జయమణి, గుణశేఖర్, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన టీఎల్ఎంను పరిశీలిస్తున్న ఎంఈఓ రవి

వజ్రవేల్ రెడ్డికి నివాళి

నాగలాపురం: పిచ్చాటూరు సర్పంచ్ రోసిరెడ్డి చిన్నాన్న వైఎస్సార్‌సీపీ నేత వజ్రవేల్ రెడ్డి మంగళవారం ఉదయం అనారోగ్యంతో మరణించారు. సమాచారం అందుకున్న సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పిచ్చాటూరుకు చేరుకుని వజ్రవేలు రెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం సింగిల్‌విండో చైర్మన్ హరిచంద్రరెడ్డి, సర్పంచ్ రోసిరెడ్డితో పాటు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాడ సంతాపాన్ని తెలిపారు. కార్యక్రమంలో వజ్రవేల్ రెడ్డి సోదరులు మురుగేష్ రెడ్డి, పార్టీ నాయకులు భాను ప్రకాష్ రెడ్డి, మునిరాజు రెడ్డి, గోవిందన్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నూకతోటి రాజేష్

శ్రీకాళహస్తి డివిజన్

పాలీసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత కోచింగ్

సత్యవేడు: పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు పాలిటెక్నికల్ పాలీసెట్ ప్రవేశ పరీక్ష రాయాలనుకునే వారికి ఉచితంగా కోచింగ్ ఇస్తున్నట్లు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఉషాదేవి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఏప్రిల్ 30న పాలిటెక్నికల్ పాలిసెట్ ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. ఈ పరీక్షకు నోటిఫికేషన్ విడుదలైందని, ఈసారి తిరుపతి జిల్లాలో తిరుపతి, గూడూరుతోపాటు సత్యవేడు పాలిటెక్నిక్ కళాశాల ఎగ్జామ్ సెంటర్‌గా ఉంటుందన్నారు. పాలిసెట్ ప్రవేశ పరీక్ష దరఖాస్తు ఉచితంగా చేయిస్తామన్నారు. www.polioet.ap.nic.in వైబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారితోపాటు ప్రస్తుతం 10వతరగతి పరీక్షలు రాసేవారు కూడా పాలీసెట్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.100, బీసీ, ఓసీ విద్యార్థులు అయితే రూ.400 ఫీజు చెల్లించాలన్నారు. రిజిస్ట్రేషన్ కోసం కళాశాలలో హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. ఇక్కడ చదివే విద్యార్థులకు వందశాతం ఉద్యోగం గ్యారెంటీ అన్నారు. ఈసారి పాలిటెక్నిక్ కళాశాలలో వివిధ కోర్సుల్లో చేరే ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మెస్ సౌకర్యం కల్పిస్తామన్నారు.

ఒంటరి ఏనుగు సంచారం

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ చైతన్యపురం సమీపంలోని అరటి తోటలోకి శేషాచల అడవిలో నుంచి మంగళవారం రాత్రి ఒంటరి ఏనుగు ప్రవేశించింది. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వగా, ఎఫ్ఆర్ఓ సుదర్శన్, ఎఫ్ఎస్ఓ రమేష్ బాబు, ఎఫ్‌బీఓ వెంకటేశ్వరరావు, ఫారెస్ట్ సిబ్బంది గ్రామంలోకి చేరుకుని బాణసంచా పేల్చి, పలకలు వాయించడంతో ఒంటరి ఏనుగు వెనుదిరిగి అడవిలోకి వెళ్లింది. అరటి తోట కొంత భాగం ధ్వంసం చేసింది. మళ్లీ ఎక్కడ ఏనుగులు గ్రామంలోకి వస్తాయేమో అని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.



చైతన్యపురంలోని అరటి తోటలోకి వచ్చిన ఏనుగు



చిన్న వయసులో పుస్తెల భారం వద్దు


ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎస్పీ నరసింహమూర్తి

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో శ్రీకాళహస్తీశ్వర స్వామి కల్యాణోత్సవం సందర్భంగా బాల్యవివాహాలు నిర్వహించరాదని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి కోరారు. పట్టణంలోని రాజగోపురం నుంచి మంగళవారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ భారీ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయసులో పుస్తెల భారం మోపవద్దని, బాల్య వివాహం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కమిషనర్లు ఎంఎం రెడ్డి, రమేష్‌బాబు, యూత్ చైర్మన్ షేక్ అజారుద్దీన్, కిషోర్, గైడ్ కెప్టెన్ పద్మావతి, నిర్మల, సరిత, స్కౌట్ మాస్టర్లు, జెడ్పీబాలుర, బాలికల ఉన్నత పాఠశాల, బాబుఅగ్రహారం, సరస్వతీబాయి, భాస్కర్‌పేట పురపాలకసంఘ పాఠశాలలు, ఏపీ గిరిజన సంక్షేమ పాఠశాల, ఆర్‌సీపీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి 350 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

బుచ్చినాయుడుకండ్రిగ: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలను ప్రోత్సహించినా, చేసినా జైలు తప్పదని బాల్య వివాహాల వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనరు చందమామల కోటయ్య తెలిపారు. మంగళవారం బుచ్చినాయుడుకండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో బాల్య వివాహాలపై విద్యార్థులకు ప్రజాప్రగతి ట్రస్టు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రగతి ట్రస్టు కోఆర్డినేటర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ బాల్య వివాహాలను ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దక్షిణ కైలాసం..ముక్కంటి క్షేత్రం

- శ్రీకాళహస్తి ఆలయానికి 4 గోపురాలు
- ఒక్కో గోపురానికి ఒక ప్రత్యేకత


శ్రీకాళహస్తీశ్వరస్వామి


శ్రీకాళహస్తీశ్వరాలయ పరిసరాలు

శ్రీకాళహస్తి: అభిషేక ప్రియుడైన శ్రీకాళహస్తీశ్వరుడు స్వయంభు వాయులింగ స్వరూపుడైన సత్య ప్రత భాస్కరక్షేత్రం అయిన శ్రీకాళహస్తిలో వెలిశాడు. క్షేత్రం అంటే స్వయంభులింగం, కొండ, ప్రవహించే నీరు ఉన్న నది, గోపురాలు ఉండాలి. అటువంటి ఆలయ నిర్మాణం శ్రీకాళహస్తిలో నాటి రాజులు హిందూ సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా నిర్మించారు. ఆ నిర్మాణాలను కేశోప నిషత్తు మేరకు స్వయం వాయులింగ స్వరూపుడిగా వెలసిన శ్రీకాళహస్తిలో ఉత్తర దిశగా ప్రవహించే స్వర్ణముఖి నది, నాలుగు గోపురాలు, సుమారు 18 మైళ్ల దూరం మేరకు ఉన్న శ్రీ కైలాస గిరి పర్వత పంక్తులు ఉన్నాయి. ఈ పర్వతాలు కూడా శ్రీ(సాలెపురుగు) కాళ(నాగుపాము) హస్తి (ఏనుగు) ఆకారంలో ఉండడం గమనార్హం. అలాగే ఆలయ ప్రాకారాన్ని చతురస్రాకారంలో నాలుగు దిక్కు ల్లో నాలుగు గోపురాలను నిర్మించారు. ఈ గోపురాల్లో మూడు 12వ శతాబ్దంలో వీరనరసింహరాయలు నిర్మించగా దక్షిణ గోపురాన్ని కులోతుంగ చోలుడు నిర్మించినట్టు చారిత్రక ఆధారాలు ఉన్నాయి.

ధర్మ..అర్థ..కామ.. మోక్షాలకు ద్వారాలు..

ఈ నాలుగు గోపురాలు ధర్మ, అర్థ, కామ, మోక్షాలకు చతుర్విధ పురుషార్థాలకు రుగ్వేదం, యజుర్వేణ వేదం, సామవేదం, అధర్వణ వేదానికి ప్రతీకలని స్థల పురాణం. బాలజ్ఞానాంబిక గోపురం ద్వారా ప్రాకారం లోపలకు ప్రవేశించిన ప్రతి భక్తుడు ధర్మం బుద్ధుడై వెలుగుతూ అర్థం సంపాదిస్తూ కోర్కెలు తీర్చుకుని శివయ్యను దర్శించి మోక్షం పొందాలని, నాలుగు గోపురాల సారాంశంగా పురాణాలు చెబుతున్నాయి. స్వామివారి ఆలయ ప్రవేశ ద్వారం దక్షిణ దిశగా ఉండడం వల్లే ఈ ఆలయానికి దక్షిణకాశి అని కూడా పేరు కలిగి ఉంది. అందువల్ల దక్షిణ దిశ ముఖద్వారం ఉండడంతోనే ఆ దిశకు ప్రతినిధులైన రాహు–కేతు ప్రభావానికి తగ్గించే దోషనివారణ పూజలను ఆలయంలో ప్రారంభించారు. ధర్మానికి, రుగ్వేదానికి ప్రతీక అయిన ప్రధాన ద్వారం ఇదే. ఈ గోపురం సమీపంలోనే శ్రీ బాలజ్ఞానాంబిక ఆలయం ఉండడం గమనార్హం. శివయ్య గోపురం ఈ గోపురం ఆలయ ప్రాకారంలో ఉన్న శ్రీ పాతాళ వినాయకుడు ఆలయానికి ఎదురుగా ఉంటుంది. ఈ గోపురం అర్థానికి యజుర్వేదానికి, ప్రతీక ఈ ద్వారానే ఉత్సవమూర్తులైన శ్రీకాళహస్తీశ్వర స్వామి, స్వామివారి దేవేరీలు అయిన శ్రీ జ్ఞానాంబిక, గంగమ్మ, పంచమూర్తులు కూడా పురవీధుల ప్రదర్శనకు వస్తారు. పశ్చిమంగా ఉండే తిరుమంజనం గోపురానికి సమీపంలో స్వర్ణముఖి నది ఉంది. ఈ నదిలో స్నానం ఆచరించి భక్తులు నవ గ్రహాలకు, 27 నక్షత్రాలకు, సూర్యచంద్రులకు, నాగ దేవతలకు ప్రతీక అయిన ఈ తిరుమంజన గోపురం ద్వారా లోనికి వెళ్లి స్వామివారిని దర్శించుకోవచ్చు. ఆలయంలోని నాలుగు గోపురాల కంటే ఈ గోపురం నుంచి వెళ్లి స్వామివారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీర్చుతారన్నది ఆలయ ప్రాశస్త్యం. కోర్కెలు తీర్చుకోవడానికి సామవేదానికి ప్రతీకలుగా ఈ గోపురాన్ని వర్ణిస్తారు. అంతేకాకుండా ఈ గోపురం ఎక్కే మార్గంలో స్వామి రుద్ర పాదాలు కూడా ఉండడం గమనార్హం. అదేవిధంగా స్వామి కల్యాణోత్సవం అనంతరం వసంతోత్సవాన్ని కూడా ఇక్కడే నిర్వహించడం ఆనవాయితీ.

సూర్యపుష్కరిణి జలంతో అభిషేకం..

స్వామివారికి అభిషేక జలాన్ని సమీపంలోని సూర్య పుష్కరిణి నుంచి పరిచారికలు ఈ మార్గం నుంచి తీసుకెళ్లి స్వామివారికి అభిషేకం చేస్తారు. దక్షిణ గోపురం దక్షిణ దిశలో ఉంది. ఈ దిశలో ఆలయంలోనికి ప్రవేశిస్తే మోక్షం లభిస్తుందని అధర్వణ వేదం ప్రతీకగ గోపురాన్ని పేర్కొంటారు. తైఅమావాస్య పర్వదినాల్లో ఉత్సవమూర్తులైన స్వామి, అమ్మవార్లు ఈ గోపురం నుంచి బయలుదేరి శ్రీ భరద్వాజా తీర్థం వరకు వెళ్లి భరద్వాజేశ్వర ఆలయం వద్ద విశేష పూజలు అందుకుంటారు. అందువల్ల ప్రముఖులు, సినీ, ఇతర కళాకారులు సైతం ఈ ద్వారం ద్వారా ఆలయంలోనికి ప్రవేశిస్తారు.

శివరాత్రి వేడుకలకు బుగ్గకొలను సిద్ధం

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మంచినీళ్లగుంటకు అనుసంధానంగా ఉన్న బుగ్గ కొలనులోని నందీశ్వరున్ని మహాశివరాత్రి వేడుకలకు సిద్ధం చేశారు. సర్పంచ్ నగేశం ఆధ్వర్యంలో మంగళవారం కొలనులో ఉన్న మురుగునీటిని శుభ్రం చేసి నూతనంగా రంగులు వేయించారు.

నేడు నందిసేవ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివ రాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని బుధ వారం రాత్రి నందిసేవ నిర్వహించనున్నారు. శ్రీకాళహస్తీశ్వరస్వామివారు బంగారు నంది, జ్ఞానప్రసూనాంబ అమ్మవారు బంగారు సింహ వాహనం అధిష్ఠించి పురవిహారం చేయనున్నారు. నంది, సింహ వాహనాలపై ఊరేగుతున్న శివపార్వతులను దర్శించుకోవడానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలిరానున్నారు. నంది సేవ సందర్భంగా ఎలాంటి సమస్యలు ఎదురు కాకుండా అధికారులు పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇక ఉదయం స్వామివారు ఇంద్ర విమానం, అమ్మవారు చప్పరంపై భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నారు.

సురుటుపల్లిలో పటిష్ట బందోబస్తు


పోలీసు సిబ్బందికి సూచనలు ఇస్తున్న సీఐ మురళి

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి గ్రామంలో ప్రదోష క్షేత్రంగా బాసిల్లుతున్న శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు సీఐ మురళి తెలిపారు. ఈ మేరకు పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న శివరాత్రి ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. మహా శివరాత్రిని పురస్కరించుకుని ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని పోలీసు సిబ్బందికి ఆలయ ప్రాంగణంలో సూచనలిచ్చారు. ఇటు తమిళనాడు నుంచి భారీసంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ కలగకుండా జాగ్రత్త వహించాలన్నారు. భారీ సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో ఎక్కడ కూడా క్యూలైన్లలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. మహాశివరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరగడానికి 50 మంది పోలీసు సిబ్బందిని నియమించామని, ఇందులో ఇద్దరు ఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్‌ఐలు ఉన్నట్లు వివరించారు. నాగలాపురం ఎస్‌ఐ సునీల్, సత్యవేడు ఎస్‌ఐ రామస్వామి పర్యవేక్షణలో జరుగుతుందన్నారు.